ప్రజానావ
ప్రతి అక్షరం జనం కోసం..
శనివారం 24 మే 2025 హైదరాబాద్


# టీబీ రహిత సమాజం నిర్మిద్దాం

**ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్**



**ప్రజానావ, ఉట్నూర్ :** ప్రతి ఒక్కరూ క్షయ వ్యాధి నివారణకు కృషి చేయాలని, ఈ వ్యాధిని అరికట్టాలంటే వ్యాధి సోకిన వారు తగిన జాగ్రత్తలు పాటించాలని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైద్య శాఖ సిబ్బందితో కలిసి టీబి ముక్త భారత్ కు సంబంధించిన గోడ పత్రులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీబీ వ్యాధి ఓ అంటూ వ్యాధి అని, ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటిస్తేనే ఈ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. ప్రభుత్వాలు వ్యాధి సోకిన వారికి వెయ్యి రూపాయలతో పాటు ఉచిత నిత్యవసర సరుకులు, గిరిజనులకు ప్రత్యేకంగా ప్రయాణ ఖర్చుల నిమిత్తం 750 రూపాయలు అందిస్తున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాధి నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీబీ కంట్రోలర్ అధికారిణి డా. సుమలత, జిల్లా టీబీ కో-ఆర్డినేటర్ జాదవ్ సుదర్శన్, టీబీ సూపర్వైజర్ వెంకటేశ్వర్, అంబారావు ల్యాబ్ టెక్నీషియన్ వేణు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా ఎదగాలి

**కలెక్టర్ రాజర్షి షా**



**ప్రజానావ, ఆదిలాబాద్ :** మహిళలు స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా ఎదగాలని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం ట్రైల్‌బ్లేజర్స్ ఇండియా ఫౌండేషన్, హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్ పి సి ఎల్) సహకారంతో నిరుపేద మహిళలకు టైలరింగ్ తరగతులను జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన గావించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా ఏటా 60 మంది మహిళలకు టైలరింగ్ నైపుణ్యాలను అందించడం, స్వావలంబనను పెంపొందించడం స్థిరమైన ఉపాధి అవకాశాలను సృష్టించడం ద్వారా వారిని సాధికారపరచడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఈ కార్యక్రమాన్ని సాదు సుందర్ పెడేలి సమన్వయం సహాయ సహకారాలు అందించారన్నారు. గ్రామీణ మహిళలకు డిజైన్, కొలత, కటింగ్, కుట్టుపనిలో వృత్తిపరమైన శిక్షణను అందించడం ద్వారా వివిధ దుస్తులు, బ్యాగులు, ఫైల్స్ వంటి చేతితో తయారు చేసిన ఉత్పత్తులను రూపొందించడం ద్వారా వారి అభ్యున్నతికి తోడ్పడుతుందన్నారు. నిజామాబాద్ లోని హిందుస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ చీఫ్ రీజినల్ మేనేజర్ ఎస్. ఎస్. శ్రీనివాసు హెచ్‌పిసిఎల్, సిఎస్ఆర్ కార్యకలాపాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ డైరెక్టర్ రవీందర్ రాథోడ్, మహిళా సమైక్య సంఘాల మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



# నకిలీ విత్తనాలు అమ్మితే పీడీ యాక్ట్

**ఎస్పీ మహేశ్ బీ గితే**

**ప్రజానావ, సిరిసిల్ల:** రాజన్న సిరిసిల్ల జిల్లా పరిధిలో నకిలీ విత్తనాలను విక్రయించినా, రవాణా, ఉత్పత్తి చేస్తున్నట్లు సమాచారం అందితే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని ప్రజలు, రైతులకు ఎస్పీ మహేశ్ బీ గితే సూచించారు. వానాకాలం సాగు ప్రారంభమవుతున్న వేళను దృష్టిలో ఉంచుకొని రైతన్న నకిలీ విత్తనాల బారీన పడకుండా ముందస్తు చర్యల కోసం జిల్లా పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందన్నారు. నకిలీ విత్తనాల సరఫరా, ఉత్పత్తి, అమ్మకాలు అరికట్టడానికి వ్యవసాయ శాఖ, జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు చేపడుతున్నట్లు చెప్పారు. గతంలో నకిలీ విత్తనాలు అమ్మిన వారిపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి వారి కదలికలను ఎప్పటికప్పుడు గమనించడం జరుగుతుందన్నారు. నకిలీ విత్తనాలు కలిగి ఉన్నా, అమ్మినా, రవాణా చేసే వ్యక్తులపై క్రిమినల్ కేసులు, పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. జిల్లాలో ఒక్క రైతుకు కూడా నకిలీ విత్తనాలతో మోసపోకుండా చూసే బాధ్యత వ్యవసాయ, పోలీసు అధికారులపై ఉంటుందన్నారు. జిల్లా పరిధిలో ఉన్న ఫర్టిలైజర్ షాప్, సీడ్స్ షాపులపై నిఘా ఉంచి ఆకస్మిక తనికిలు చేస్తూ నకిలీ విత్తనాల విక్రయాలను, రవాణాను అడ్డుకట్ట వేయడం జరుగుతుందన్నారు. రైతులు సీడ్స్ అండ్ ఫెర్టిలైజర్స్ షాప్ నుంచి విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు తప్పకుండా బిల్ తీసుకోవాలన్నారు. జిల్లా ప్రజలు, రైతులకు ఎవరైనా నకిలీ విత్తనాలు, పురుగుల మందులు అమ్ముతున్నారని సమాచారం ఉంటే డయల్100 కి లేదా పోలీస్ వారికి సమాచారం అందించాలని ఎస్పీ సూచించారు.

# దళారులను నమ్మి మోసపోవద్దు

**కలెక్టర్ రాజర్షి షా.. • ఫర్టి వైజర్స్, రైతుమిత్ర ట్రేడర్స్ తనిఖీ**



**ప్రజానావ, ఆదిలాబాద్:** రైతులు విత్తనాలు కొనడంలో దళారులను నమ్మి మోసపోవద్దని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అఖిల్ ఫర్టి వైజర్స్, రైతుమిత్ర ట్రెడర్స్ దుకాణాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. నిల్వ ఎరువులు, విత్తనాలు, సంబంధిత రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ ఈవానకాలనికి సరిపోయే ప్రత్తి, సోయా తదితర పంటల విత్తనాలు సంవృద్ధిగా ప్రతి డీలర్ల దగ్గర అందుబాటులో ఉంచటం జరిగిందన్నారు. డీలర్లు నకిలీ ఎత్తనాలు అమ్మితే కఠిక చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులు సైతం బీటీ3 పత్తి విత్తనాలకు అనుమతి లేదని అన్నారు. లూజ్‌విత్తనాలు కొనొద్దని సూచించారు. ఎరువుల డీలర్లు ఈపాస్‌మషిన్ ద్వారా మాత్రమే ఎరువులు అమ్మాలని ఆదేశించారు. సరిపడేంతగా ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందకూడదని కోరారు. విత్తన ఎరువుల డీలర్లపై నిఘా ఉంటుందని, టాస్క్ ఫోర్స్ టీమ్ తనిఖీలు సైతం చేస్తున్నదని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వినోద్ కుమార్, డీఏవో శ్రీధర స్వామి తదితరులు ఉన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం

**ఎస్పీ అఖిల్ మహాజన్ .. గంజాయి సాగు చేస్తున్న ఇద్దరి రిమాండ్**



**ప్రజానావ, ఆదిలాబాద్ :** గంజాయి వ్యాపారం చేసినా, సేవించినా, పండించిన వారిపై కఠిన చర్యలు తప్పవని ఎస్పీ అఖిల్ మహాజన్ హెచ్చరించారు. శుక్రవారం భీంపూర్ మండలంలోని తాంసి(కే) గ్రామంలో మంచికంటి అశోక్, ఓంకార్ గంజాయి సాగు చేస్తున్నారని సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, 30 గంజాయి మొక్కలు స్వాధీనం చేసుకున్నారు. వారిద్దరిని రిమాండ్ కు పంపారు. ప్రజలు మాదకద్రవ్యాల బారిన పడకుండా ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నట్లు ఎస్పీ తెలిపారు. ఇప్పటి వరకు జిల్లాలో దాదాపు 50 గంజాయి కేసులు నమోదు కాగా, అందులో 107 మందిపై కేసులు కాగా, 90 మంది అరెస్టు అయ్యారని, వారి వద్ద నుండి దాదాపు 26 కిలోల ఎండు గంజాయి, 230 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. గంజాయి పండించిన వారికి ప్రభుత్వ పథకాలు ఎలాంటివి అందకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటూ జిల్లా కలెక్టర్ కు నివేదిక సమర్పించినట్లు తెలిపారు. ఎలాంటి సమాచారాన్ని మెసేజ్ యువర్ ఎస్పి కార్యక్రమంలో అందించబడిన వాట్సప్ ద్వారా 8712659973 నెంబర్ కి అందించవచ్చున్నారు. ఈ నెంబర్ ఎస్పీ పర్యవేక్షణలో ఉంటుందని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయి తెలిపారు.

# హామీ నిలబెట్టుకున్న ఎమ్మెల్యే

**రాజీవ్ నగర్‌లో రెండు చేతి పంపులు ప్రారంభం**



**ప్రజానావ, తాండూర్:** బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి గత ఎన్నికల్లో తాండూరు మండలం ఐబీలోని రాజీవ్ నగర్ జీపీలో రెండు చేతిపంపులు బిగిస్తానన్న హామీని నిలబెట్టుకున్నారు. శుక్రవారం కాంగ్రెస్ మంచిర్యాల జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో అధికారులు, నాయకులు చేతి పంపులు బిగించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యూఎస్ఏఈ మనోహర్, రాజీవ్ నగర్ సెక్రెటరీ రమాదేవి, కొత్తపల్లి మాజీ సర్పంచులు కాపర్తి సుభాష్, మామిడాల రాజేశం, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ సూరం దామోదర్ రెడ్డి, మాజీ వార్డు సభ్యులు చొప్పదండి నరేష్, కొంక అశోక్, రౌతు సురేష్, వెల్లండి కవిత, పంచాయతీ సిబ్బంది, గ్రామ పెద్దలు బండారి అంజయ్య, దాగం బక్కయ్య తదితరులు పాల్గొన్నారు.

# వయోజన విద్యాబోధన కార్యక్రమం



**ప్రజానావ, దహెగాం:** దహెగాం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో ఆల్బర్ట్, ఎంఈవో శ్రీనివాస్ శుక్రవారం వయోజన విద్యాబోదన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామపంచాయతిలో ప్రజలకు అవగాహన కల్పించాలని కార్యదర్శులకు సూచించారు. ఆసక్తి గల స్పాన్సర్లు కార్యదర్శిని సంప్రదించాలని సూచించారు. బడిబాట శిక్షణ కార్యక్రమం జూన్ 6 నుంచి 12 వరకు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీవో కల్పన తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు




**ప్రజానావ, తాండూర్:** నకిలీ పత్తి విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని తాండూరు సీఐ కుమారస్వామి హెచ్చరించారు. శుక్రవారం తాండూర్ మండల కేంద్రంలోని ఐబీలో నకిలీ పత్తి విత్తనాలపై పోలీసు, వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే వెంటనే పోలీసు వారికి తెలియపరచాలని విజ్ఞప్తి చేశారు. అంతకుముందు తాండూర్ ఎంపీడీవో కార్యాలయం నుంచి ఐబీ కేంద్రం వరకు భారీ ర్యాలీ చేసి ఐబీ కేంద్రంలో 500 రైతులతో మానవహారం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో భాగంగా నకిలీ పత్తి విత్తనాలు వాడొద్దు అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో తాండూర్ ఎంపీడీవో శ్రీనివాస్, తాండూర్ ఎస్సై కిరణ్ కుమార్, మండల వ్యవసాయ అధికారిని సుష్మ, ఏఈఓలు యు శంకర్, ధనలక్ష్మి, వసుధ, రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# బెల్లంపల్లిలో అమృత్ మిత్ర



**ప్రజానావ, బెల్లంపల్లి:** అమృత్ మిత్ర కార్యక్రమంలో భాగంగా బెల్లంపల్లి మున్సిపాలిటీలో శుక్రవారం విమెన్ ఫర్ ట్రీస్ ప్రోగ్రాం నిర్వహించారు. బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చెపట్టిన అమృత్ మిత్ర కార్యక్రమములో భాగంగా విమెన్ ఫర్ ట్రీస్ కార్యక్రమ%శీ% చేపట్టమన్నారు. స్వయం సహాయక సంఘ సభ్యుల ద్వారా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతల గురించి వివరించారు. మొక్కలు నాటి వాటి బాగోగులు చూసుకునే బాధ్యత కూడా మహిళా సంఘ సభ్యులదే అని అన్నారు. అందుకు గాను అట్టి స్వయం సహాయక సంఘానికి ఆర్థిక సహకారం కూడా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేనేజర్, ఆర్వో ప్రవీణ్, సునిల్, మెప్మా పట్టణ సమన్వయ అధికారి దుర్గయ్య, సీవో కిషోర్ ఎన్విరాన్‌మెంట్‌ఇంజినీర్ సంతోష్, మెప్మా రిసోర్సు పర్సన్లు స్వయం సహాయక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# వచ్చే దసరా, దీపావళి నూతన గృహంలో చేసుకోవాలి

- 30 రోజుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులు ప్రారంభించాలి
- ఎవరికి ఒక్క రూపాయి ఇవ్వొద్దు.. డబ్బులు అడిగితే నాకు ఫోన్ చేయండి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- గంభీరావుపేట మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ ఉత్తర్వులు పంపిణీ



**ప్రజానావ, గంభీరావుపేట:** ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను లబ్ధిదారులు 30 రోజుల్లో ప్రారంభించి వచ్చే దసరా, దీపావళి పండుగలు నూతన గృహాల్లో జరుపుకోవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకాంక్షించారు. బుధవారం కలెక్టర్ గంభీరావుపేట మండలంలో రెండో విడత కింద 507 ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ ఉత్తర్వులు దత్తసాయి ఫంక్షన్ హాల్లో కేకే మహేందర్ రెడ్డి తో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గంభీరావుపేట మండలంలో రెండో విడత కింద 507 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేసినట్లు తెలిపారు.

## పైరవీలు అవసరం లేదు

ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయవలసిందిగా స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణం పురోగతి ప్రకారం పారదర్శకంగా ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందని, ఎవరికి ఒక రూపాయి ఇవ్వడానికి వీలు లేదని కలెక్టర్ సూచించారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని , నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాల్లో అందుబాటులో పెడతామని తెలిపారు. మండలంలో ఉన్న గ్రామాలకు ఇసుక రీచ్‌లను అలాట్ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ సెక్రెటరీ నుండి తాసిల్దారి గారికి సమాచారం అందిస్తే వారే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారని, ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా విడుదల ఎంపిక చేస్తామని తెలిపారు. 30 రోజుల్లో నిర్మాణ పనులను లబ్ధిదారులు ప్రారంభించకుంటే మంజూరు చేసిన ఇండ్లు రద్దయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. నిరుపేదలకు పెట్టుబడి లేని పక్షంలో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా లక్ష రూపాయల రుణం అందిస్తామని అన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను వినియోగించుకుంటూ సొంత స్థలంలో మంచి ఇండ్లు నిర్మించుకొని ప్రజల సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేక అధికారి హన్మంతు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ విజయ, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో రాజేందర్, తహసీల్దార్ మారుతి రెడ్డి, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్‌కు పార్ట్ టైం స్వీపర్స్ వినతి



**ప్రజానావ, తాండూర్:** గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ రాష్ట్ర నాయకులు శుక్రవారం హైదరాబాద్ లో గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ రాష్ట్ర గ్రంథాలయ డైరెక్టర్ శ్రీహరిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. పార్ట్ టైం స్వీపర్స్ సమస్యలను వివరించారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. త్వరలోనే సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పార్ట్ టైం స్వీపర్స్ రాష్ట్ర అధ్యక్షుడు హుస్సేన్, ప్రధాన కార్యదర్శి కాస్తాల మధు, కోశాధికారి ఖమ్మంపాటి మధుసూదన్ సహాయ కార్యదర్శులు సయ్యద్ సలీం, చెరుకుపల్లి స్వామి, కార్యవర్గ సభ్యులు వివిధ జిల్లాల పార్ట్ టైం స్వీపర్స్ తదితరులు పాల్గొన్నారు.

## తహసీల్దార్‌కు సన్మానం



**ప్రజానావ, తాండూర్:** తాండూర్ మండల నూతన తహసీల్దారుగా బాధ్యతలు చేపట్టిన యు జ్యోత్స్నను శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో తాండూర్ మండల ఆదివాసి సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి,శుభాకాంక్షలు తెలిపి శాలు వాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆదివాసి సంఘం నాయకులు మండలంలోని పలు సమస్యలు వివరించగా ఆదివాసీల సమస్యలు పరిష్కరించే దిశగా చూస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా తుడుం దెబ్బ కార్యనిర్వాహక అధ్యక్షులు మండిగ రవీందర్, తాండూర్ మండల తుడుం దెబ్బ అధ్యక్షులు కుర్సింగ బాపురావు, మండల ప్రధాన కార్యదర్శి యాపల సమ్మయ్య, కిష్టంపేట మాజీ సర్పంచ్ గడ్డం మణికుమార్, ఆదివాసి కోలావర్ సేవా సంఘం మండల యువజన సంఘం నాయకులు ఊరడి మహేష్, టేకం అంజి, ఆదివాసీ సంఘం నాయకులు ఎడ్ల గోపాల్, జైనీ బాపు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## తాటిపల్లిలో విషాదం

### ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి ఇద్దరు చిన్నారులు మృతి





**ప్రజానావ, కౌటాల :** కౌటాల మండలం తాటిపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం విషాద ఘటన జరిగింది. తాటిపల్లి గ్రామానికి చెందిన బోయర్ విశ్వనాథ్ కూతురు రాధిక(13), మహారాష్ట్రలోని గడిచిరోల్లి జిల్లా ఎట్టపెల్లి గ్రామానికి చెందిన సెండే హన్సిక(12) మొరం కోసం తవ్విన గుంతలో పడి మృతి చెందారు. శుక్రవారం బహిర్భూమికని వెళ్లిన ఇద్దరు చిన్నారులు నీటి కోసం కుంటలోకి వెళ్లగా కాలుజారి నీటిలో పడిపోయారు. ఇటీవల కురిసిన వర్షాలకు నీటి గుంటలో నీరు నిలిచి ఉండడంతో ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు అందులో పడి మృతి చెందారు. గమనించిన స్థానికులు కుటుంబీకులకు సమాచారం ఇవ్వడంతో చిన్నారులను కుంటలోంచి బయటికి తీశారు. అప్పటికే చిన్నారులు మృతి చెందడంతో వారి తల్లిదండ్రులు, బంధువుల రోధనలు గ్రామస్థుల కంటతడి పెట్టించాయి. వేసవి సెలవుల్లో బంధువుల ఇంటికి వచ్చిన సండే హన్సిక నీటి కుంటలో పడి మృతి చెందడంతో ఆమె గ్రామంలో విషాదఛాయలు నెలకొన్నాయి.




# పేదల సొంతింటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యం

- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- వీర్నపల్లి మండలంలో రెండో విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరీ ఉత్తర్వుల పంపిణీ

**ప్రజానావ, వీర్నపల్లి:** పేద ప్రజల స్వంత ఇంటి కల నెరవేర్చడమే ప్రభుత్వ లక్ష్యమని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. బుధవారం కలెక్టర్ వీర్నపల్లి మండలం లో రెండో విడత క్రింద 259 ఇందిరమ్మ ఇండ్ల మంజూరి ఉత్తర్వులు రైతు వేదిక లో కేకే మహేందర్ రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వీర్నపల్లి మండలంలో రెండో విడత కింద 259 లబ్ధిదారులను పారదర్శకంగా అర్హులుగా ఎంపిక చేసి ఉత్తర్వులు పంపిణీ చేశామని తెలిపారు. ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు 4 దశలలో 5 లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందుతుందని,400 చదరపు అడుగుల నుంచి 600 చదరపు అడుగుల లోపు ఇంటి నిర్మాణం జరిగితే 4 దశలో గ్రీన్ చానల్ ద్వారా ఆర్థిక సహాయం అందుతుందని వెల్లడించారు. బేస్మెంట్ నిర్మాణం పూర్తైన తర్వాత లక్ష రూపాయల, గోడలు నిర్మిస్తే లక్ష రూపాయలు, స్లాబ్ నిర్మించిన తరువాత 2లక్షల రూపాయలు, ఇంటి నిర్మాణం పూర్తయిన తర్వాత మరో లక్ష రూపాయలు నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలో జమ అవుతాయని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం అందించే సహాయం గురించి ఏ అధికారి లేదా దళారి నుంచి పైరవి వంటి చేయాల్సిన అవసరం లేదని, ఎవరైనా డబ్బులు అడిగితే స్వయంగా ఫోన్ చేయాల్సిందిగా స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణంలో పూర్తి సహకారం ప్రభుత్వం నుంచి అందిస్తామని, నిర్మాణానికి అవసరమైన ఇసుక మండల కేంద్రాల్లో అందుబాటులో పెడతామని తెలిపారు. మండలంలో ఉన్న గ్రామాలకు ఇసుక రీచ్ లను అలాట్ చేశామని, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి పంచాయతీ సెక్రెటరీ నుంచి తహసీల్దార్‌కు సమాచారం అందిస్తే వారే ఉచితంగా ఇసుక సరఫరా చేస్తారని, ఇంకా ఎవరైనా అర్హులు మిగిలిపోతే వారికి కూడా విడుదల ఎంపిక చేస్తామని తెలిపారు. 30 రోజుల్లో లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించకుంటే మంజూరు చేసిన ఇండ్లు రద్దయ్యే అవకాశం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ శంకర్, మండల ప్రత్యేక అధికారి రామదాసు, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు, ఇందిరమ్మ ఇండ్ల కమిటీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు, ఎంపీడీవో అబ్దుల్ వాజిద్, తహసీల్దార్ మక్తర్ పాషా, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బస్టాండ్‌లో చోరీకి పాల్పడ్డ దొంగ అరెస్టు, రిమాండ్

**ప్రజానావ, సిరిసిల్ల:** బోయినపల్లి మండలం జగ్గారావుపల్లి గ్రామానికి చెందిన కొమురయ్య అనే వ్యక్తి ఈ నెల 12న తన భార్యతో కలిసి సిద్దిపేటలోని తన బంధువుల పెళ్లికి వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. సిరిసిల్ల బస్టాండ్‌లో తన భార్య హ్యాండ్ బ్యాగ్‌లో నుంచి బంగారు నల్లపూసల తాడు, ఒక జత బంగారు చెవుల కమ్మలు, బంగారు వంక ఉంగరం, బంగారు చైన్ ఉన్న డబ్బాను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించారు. ఈ మేరకు వారు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. దర్యాప్తులో భాగంగా బస్టాండ్‌లో ఉన్న సీసీ కెమెరాల ఆధారంగా కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం ఆరేపల్లికి చెందిన నిందితుడు వేల్పుల రాజేశ్వర్ రెడ్డి (31)ని శుక్రవారం సిరిసిల్లలోని పెద్దబజారు శివాలయం వద్ద అదుపులోకి తీసుకున్నట్లు సిరిసిల్ల పట్టణ ఇన్‌స్పెక్టర్ కృష్ణ తెలిపారు. నిందితుడి వద్ద నుంచి 48.47 గ్రాముల బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ బస్టాండ్ వంటి రద్దీగా ఉండే ప్రదేశాల్లో ప్రజలు బంగారంతో వెళ్తున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు బంగారు ఆభరణాలతో ప్రయాణం చేస్తున్నప్పుడు, ఇంటి నుంచి బయటకు వెళ్లినప్పుడు ఎవరినైనా తోడుగా తీసుకెళ్లాలన్నారు. రద్దీ ప్రదేశాలు, ఇండ్ల వద్ద ఎవరైనా కొత్తగా, అనుమానస్పదంగా కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.






